| | |
|---|---|
| **శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi** |
| మార్చి 2023 | March 2023 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 104వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము** | తాడిమేటి సత్యనారాయణ | 9 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 19 |
| **4.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | యనమండ్ర సంధ్యా దేవి | 24 |
| 5. | No Escaping Yama | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita - 10 | V Krithivasan | 40 |
| 7. | My Thatha | Mahidhar Sridhar | 44 |


**Events in Sri Ramana Kendram in March 2023**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd and 30th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# మనమే మారాలి

డా॥ కే.యస్. గారి 104వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

తలచిన రీతిలో రోజువారీ విషయాలు జరగాలంటే అది కుదరదని మనకు అసంతృప్తిగా వుంటుంది. ఏదో బయటి సంగతులే కాదు; మన ఇంటిలో కూడ ఇలాగే వుంటుంది. ఏదో కారణం వల్ల భార్య మీరు చేయమన్నది చేయలేక పోవచ్చు. పిల్లలు, ఇంకా చిన్నవారుగా ఉన్నప్పటికీ మాట వినకపోవ్వు. చదువుకోమని ఏదో చేయమని చెబితే దాన్ని పాటించరు. మీకు చాలా బాధ కలుగుతుంది. ఎక్కువ విసుగు వచ్చినప్పుడు అసలు పెళ్ళి చేసుకున్నది పెద్ద తప్పు అనిపిస్తుంది; బ్రహ్మచారిగా వుండి వుంటే ఎంతో బాగుండేది అనుకుంటారు. అదే బ్రహ్మచారులను అడిగితే వాళ్ళు పెళ్ళి చేసుకోవాలని వుందని చెబుతారు. ఎలా చూసినప్పటికీ సుఖం లేదనిపిస్తుంది. ఎవరినైనా మార్చడానికి వీలవుతుందా? కుటుంబంలో మనతో వున్నవారు, లేదా దగ్గరి వారు మనకు బాగా తెలుసుననుకుంటాము. ఒక్కొక్కసారి భార్య లేదా భర్త ఏదో అన్నందుకు మనకు దిగ్భ్రాంతి అవుతుంది. నీవు అలాగ మాట్లాడతావని అనుకోలేదు అంటాము.

## సంభాషణతో అభిప్రాయం

ఎవరినైన మొదటిసారి కలిసినప్పుడు, మీ పేరేమిటి, ఏమి చేస్తుంటారని అడుగుతాం. అలా పరిచయమైన తరువాత మనకు తెలుసు ననుకొని అన్ని ప్రశ్నలు అడగం. అలాంటప్పుడు వారి

యిష్టాయిష్టాలు అర్థమయ్యాయనుకుంటాం. ఫలాని విషయం మాట్లాడ రాదని, వివాదం ఏర్పడుతుందని అర్థం చేసుకొంటాం. అతనిని గురించిన ఒక అభిప్రాయానికి వచ్చి, కోపిష్టి, లేదా అసూయాపరుడు అలా నిశ్చయానికి వస్తాం. కొంతకాలం పాటు పరస్పరం మాట్లాడుకొనిన కారణంగా అలాంటి అభిప్రాయానికి వస్తాం. మధ్యలో ఎవరో ఆ వ్యక్తి దుష్టుడు, క్రూరుడు అని చెప్పారనుకోండి. మరొక రోజు మరెవరో అతను లౌకికమైనవి అన్నీ వదిలేశాడనీ, సన్యాసం పుచ్చుకున్నాడని చెబితే, ఎలా అనిపిస్తుంది. అది మనం నమ్మలేము. వెంటనే మరొక ఆలోచన వస్తుంది. సన్యాసి అయ్యాడంటే, ఏదో ఇందులో మర్మం వుంది. దొంగ సన్యాసి అయినట్లున్నాడు. దగ్గరిగా వున్నామని అంటే కొంత కాలం పాటు అలా వుండడం వల్ల కొన్ని విషయాలు అతని గురించి సాధారణంగా ప్రవర్తించే రీతిని అర్థం చేసుకున్నామని మాత్రం చెప్ప గలం. కాని అన్ని సందర్భాలలో అలా వుంటాడని చెప్పలేం.

కాలంతోబాటు మనుష్యుల ప్రవర్తన, అభిప్రాయాలలో మార్పులు వస్తాయన్నది మనం మామూలుగా గుర్తించం. ఒకరిని గురించి ఏర్పరుచుకొన్న అభిప్రాయాలు అలాగే వుంచుకుని వ్యక్తులను అంచనా వేయడం మనం చేసే ఒక పెద్ద పొరబాటు. భార్య, పిల్లలు, దగ్గరగా వున్నారనుకొనేవారు, ఇతరులూ కూడ మారడం సహజం. ఆ మాటకు వస్తే స్వయంగా ఎంత మారామో, మారుతామో మనకే తెలీదు. మన ఇష్ట ప్రకారమే ఇంట్లో వాళ్ళు, ఇతరులు, మారి తీరాలనుకోవడం శుద్ధ అవివేకం. భగవాన్ అందుకే

మొదట మంచి చెడులు ఆలోచించుకుని మీరు మారండి అప్పుడు ఇతరులు మారే అవకాశం వుందని అనేవారు.

## అపవాదులు సహజం

సామాజిక సేవా కార్యక్రమాల విషయంలోను భగవాన్ ఇతరులు మెచ్చుకుంటారు, మీ ఫోటోలు పత్రికలలో అచ్చు వేస్తారు, మొదలైన ఉద్దేశాలు వుండరాదని చెప్పారు. మనం సహృదయంతో సేవ చేస్తున్నప్పటికీ, ప్రచారం కోసం అలాగ చేస్తున్నారు, డబ్బు కాజేశారన్న అపవాదులు వేస్తాము. ఎందుకు అలాగ చేస్తారంటే అది మానవ నైజం. స్వయంగా ఎవరికి వారు సన్మార్గంలో వుంటూ, అహంకారం లేకుండ జీవనం గడపడం అన్నిటికంటే ఉత్తమమైన సేవగా భావించాలని భగవాన్ చెప్పారు.

నిస్వార్థంగా వుండడం అన్నిటి కంటే గొప్ప గుణం. సమాజానికి అలాంటి వ్యక్తులను ఎనలేని సేవ చేసిన వారిగా భావించవచ్చు. మహా భారతంలోని దధీచి ముని జీవితం ఈ విషయంలో నిస్వార్థతతకు ఒక గొప్ప ఉదాహరణ. దధీచి నిరంతరం దైవధ్యానంతో గడిపేవాడు. దధీచి వద్దకు ఇంద్రుడు వచ్చి ఒక కఠినమైన కోరికను తెలిపాడు. ఆ కాలంలో దుష్టుడు అతి శక్తివంతుడైన వృత్తాసురుడు ఇంద్రునికి బద్ధశత్రువు, అజేయుడు. ఇంద్రుడు కొన్ని అపచారాలను చేసిన కారణంగా తన శక్తిని మొత్తం కోల్పోయాడు. వృత్తాసురుని సంహరించడానికి శక్తిని ఇచ్చి సహాయ పడవలసినదిగా ఎందరో దేవుళ్లను కోరాడు. కాని వారు వృత్తాసురునికి తాము ఎన్నో వరాలు అప్పటికే ఇచ్చామన్నారు.

తాము సహాయం చేయలేక పోవచ్చు. అయితే ఒక మార్గాన్ని చూపించారు.

దధీచి ముని ఎన్నో ఏళ్ళు గొప్ప తపస్సు చేస్తున్నాడు. అందు వల్ల ఆ ఋషి వెన్నెముక ఈ ప్రపంచంలో అన్నిటి కంటే బలిష్ట మైనది. నీవు అతని వెన్నెముకను గనుక సంపాదించ గలిగితే, దాని నుండి తయారు చేయబడే ఆయుధంతో వృత్తాసురుడు సంహరింప బడతాడని సలహా యిచ్చారు దేవతలు. ఇంద్రుని సందేహం వృత్తాసురుని వద్దకు వెళ్ళి అతని వెన్నెముక కావాలని అడగడం ఎలాగ? కాని వాళ్ళు మాత్రం దధీచి ఎంతో త్యాగమూర్తి, నీవు వెళ్ళి అడిగితే తప్పక సరేనంటాడని భరోసా ఇచ్చారు. ఆ సలహా మేరకు ఇంద్రుడు దధీచి వద్దకు వెళ్ళాడు. తనకు వచ్చిన గొప్ప ఇబ్బంది గురించి చెప్పుకుని తాను వచ్చిన పనిని గురించి కూడ చెప్పాడు. మనం ఎవరినైనా తన వెన్నెముకను ఇమ్మని అడగడ మంటే ఎలా వుంటుందో ఆలోచించండి. కాని త్యాగమూర్తి అయిన దధీచి మరింకేమీ సందేహించక వెంటనే ఒప్పుకున్నాడు. మీకు ఉపయోగపడుతుందను కుంటే అలాగే ఇచ్చేస్తానని ప్రాణత్యాగం చేశాడు. వెన్నెముకను సంపాదించిన ఇంద్రుడు దాని సహాయంతో వృత్తాసురుని వధించాడు.

## నిస్వార్థ సేవ

మన మధ్యలో వుండిన మరొక త్యాగమూర్తి గాంధీజీ. రక్తపాతం లేకుండ దేశాన్ని పరాయిల సంకెళ్ళ నుండి విడిపించి స్వతంత్ర్యాన్ని సాధించిన మహానుభావుడు. తన కోసం ఏ ఆస్తులు

సంపాదించుకోలేదు. ఆయన మరణించినప్పుడు న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంపాదీయంలో ఈ శతాబ్దపు అతి గొప్ప వ్యక్తి దేహం చాలించే సమయానికి ఆయన ఆస్తి విలువ ఐదు డాలర్లు. ఆ రోజుల్లో డాలరు ఐదు రూపాయలు మాత్రమే. అది గాక జేబు గడియారం, చెప్పులు, మూడు కోతుల బొమ్మ, చెక్క పలక, వ్రాసుకునేందుకు చిన్న బల్ల. ఆయన తలచుకొని వుంటే ఏ స్థాయికైన ఎదిగివుండవచ్చు.

గాంధీజీ ఆగస్టు 15వ తారీఖున మొత్తం దేశం స్వాతంత్ర్యం వేడుకలను జరుపు కొంటుంటే నౌకాలీలో కాందిశీకుల కన్నీళ్ళు తుడుస్తున్నాడు. మనం అయితే అలా చేయగలమా? స్వాతంత్ర్యం అంటే నా అభిప్రాయం వేరు అని గాంధీజీ అన్నారు. ప్రజలు తీవ్రమైన కష్టాలు పడుతున్నప్పుడు ఢిల్లీలో కూర్చొని వుండలేనన్నారు. మనం దానితో ఏకీభవించి వుండే వాళ్ళం కాదు. కాని తాను ఒక సాధువు కావటం కోసం రాజకీయాలలో వున్నానని అనేవారు. గాంధీజీ ప్రజల కోసం తనను సమర్పించుకున్నాడు. జ్ఞాని అలాగే ప్రవర్తిస్తాడు. మనకు ఆ నమ్మకం కుదరదు, కాని ఇతరులు అలా ప్రవర్తించాలని ఆశిస్తాం. మన సమాజంలోని ప్రజలు మంచివారిగా వుండాలని కోరుకునే బదులు మనం ముందు అలాగ ప్రవర్తిస్తే, ఇతరులు కూడ మంచి వారవుతారని భగవాన్ చెప్పారు.

## వ్యక్తిత్వ భావన

ఇతరులతో భేదాభిప్రాయాలు ఎందుకు వస్తాయి? దానికి మనలో ఒక వ్యక్తిత్వ భావన వుండడమే కారణం. మన అహం వల్ల నా మాటే చెల్లుబడి కావాలి. కాని ఎవ్వరూ నీకు విధేయతను

చూపడానికి ఇష్టపడరు. తమకు ఇతరులు విధేయులుగా వుండాలని ఆశిస్తారు. నమ్రత చాలా ముఖ్యమని భగవాన్ అందుకే అనేవారు. అలాంటి పరిస్థితుల్లో మనం చేయాల్సింది చెప్పదలచు కున్నది చెప్పడం వరకే. దాని ప్రకారమే ఇతరులు నడుచు కొనాలని ఆశించరాదు. సమస్తమూ మనకే తెలుసునని భావించరాదు. నీ గురించి నాకు ఏమి తెలుసు. ముప్ఫై, నలభై ఏళ్ళ పాటు దగ్గరగా మసలినప్పటికీ నీ సంగతి పూర్తిగా అవగాహన అయిందని చెప్పలేను. మరొకటి కాలం గడిచే కొద్దీ వ్యక్తులు, వాళ్ళ అభిప్రాయాలు మొదలైనవి మారుతాయి. మన విషయంలో అలాగే జరుగుతుంది. కుటుంబ సభ్యుల విషయంలో కూడ అదే జరిగే అవకాశం వుంటుంది. అందుకే మునుపటి మాదిరి ఎదుటి వారిని అంచనా వేసి మార్చడం వీలుకాని పని. మనలాగ భగవాన్ మాత్రం వ్యక్తులను మారమని ఎప్పుడూ చెప్పలేదు.

పొగాకు వాడుకకు బాగా అలవాటు పడిన హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయకు ఆయన సోదరితో సహా ఎందరో, దానిని మానుకోమని ఎంతగానో చెబుతూ వచ్చారు. అది చెడు అలవాటని తనకు తెలుసుననీ, కాని మానలేకపోతున్నానని ఆయన అనేవాడు. రమణాశ్రమానికి వచ్చిన ఆయన మహర్షి పట్ల గొప్ప గౌరవం ప్రదర్శించేవారు. తాను ఆశ్రమానికి వచ్చిన తరువాత తనకే తెలియని ఏదో అద్భుతమైన కారణం వల్ల తాను పొగాకును వదలలేదు. పొగాకే తనను వదిలి వెళ్ళింది అన్నారు. భగవాన్ వద్దకి వచ్చిన తరువాత అనూహ్యంగా అలా జరిగింది. సాధువులు, జ్ఞానుల సమక్షంలో అలాంటివి జరగడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) తాడిమేటి సత్యనారాయణ

## 51వ పద్య తాత్పర్యము

ఎప్పుడు ఒకడు దేహము లేనివానిగనే, తన నిజ స్వరూపమును, తన జ్ఞానచక్షువులచే తాను చూడగల్గుచున్నాడో ఆ క్షణమే అన్ని వస్తువుల యందు గల ఆశ పూర్తిగ నాశమొంది, పూర్ణశాంతి సుఖమును పొందిన వాడగును.

## వ్యాఖ్య

తీవ్ర విచారణచే తనను తనలో అన్వేషించి, తను ఒక ప్రత్యేకమైన ఉనికి గల వ్యక్తియని తలంపక యుండుటయే (అనగా దేహాత్మభావము లేకుండటయే), తన నిజస్థితియగును. దేహము నేను అని పట్టుకొన్న జీవుడు, విచారణచే తన ఉనికిని గ్రహించి, తాను పూర్ణవస్తువని అనుభవపూర్వకముగ, తన జ్ఞాన చక్షువులచే తనను తానుగా చూచుటయే ఆత్మ సాక్షాత్కారమగును. చలనము లేని మనస్సే ఆనంద స్థితి. ఆ ఆనందమే పరమానంద సుఖము. ఎప్పుడూ మన స్వరూపముగా లేని జడశరీరమును 'నేను' అని పట్టుకొనిన దేహాత్మ భావన వలనే సకల అనర్థములు దుఃఖములు కలుగుచున్నవి. ఈ అవిద్యామోహమును విచారణచే, జ్ఞాన చక్షువులతో చూచిన ఆ రోజే విరాగియై శాంతి సుఖములను పొందిన వాడగుచున్నాడు అని పరమేశ్వరుడు చెప్పుచున్నారు.

## 52వ పద్య తాత్పర్యము

సకల శాస్త్రములలో ఎవడు జన్మలేని వాడనియూ, ఈశ్వరుడనీ ఎవరైతే చెప్పబడుతున్నాడో; ఎవడు ఎప్పుడూ శరీరము లేనివానిగనూ, గుణరహితుడుగనూ, ఆత్మస్వరూపముగనూ ఉన్నాడో వాడే నేను. ఆ స్వరూపమే నేనుగ ఉన్నాను. ఇందు లేశమైనను సందేహమే లేదు.

## వ్యాఖ్య

శాస్త్రములలో చెప్పబడిన ఆత్మస్వరూప లక్షణములను చెప్పి, అటువంటి పరవస్తువు నేనే యని, నా స్వరూపముగ ఉన్నానని దానిని శాస్త్ర ప్రమాణముచే నిర్ణయము చేయబడుచున్నది.

ఏ పరవస్తువు జన్మరహితమైనదిగనూ, సకల భువనములకూ, వాటి ప్రాణులకూ ఈశ్వరుడుగా గోచరించుచున్నదో, దానిని సకల శాస్త్రములు స్తుతించుచున్నవి. దాని వ్యాపక తత్త్వమును గూర్చి చెప్పునపుడు, అన్ని దేహముల లోపల బయటా వ్యాపించి యుండి, తాను ఒక శరీరము లేని చిదాకాశరూపముగ వున్నదని చెప్పబడు చున్నది.

పైగా, సకల గుణములతో చేరియున్ననూ, ఆ గుణముల వల్ల దోషము నొందక గుణాతీతముగా ఉన్నది. ఇటువంటి పరవస్తువైన ఆత్మయేు నేను అనుటలో, కొంచమైననూ సందేహమునకు చోటు లేదని చెప్పబడుచున్నది.

## 53వ పద్య తాత్పర్యము

నేను విజ్ఞాన మాత్రముగ నుండువాడను. అతి నిర్మలమైన వాడనగుదును. పైగా విముక్తుడను కూడా. ఒక కాలములో నుండి

మరొక కాలములో కన్పించకుండ, ఎప్పుడూ ఇక్కడా అక్కడా అని కాక అంతటా వున్నవాడినగుదును. నేను అకారణములచే తెలిసి కొనబడు ఏ వస్తువునూ కాను, నేను ఏ ఒక్క దానిచే పట్టుకొనుటకో విడుచుటకో వీలుకాని వాడను. నేను దుఃఖరహితుడను. నేను ఎప్పుడూ బ్రహ్మస్వరూపుడను.

## వ్యాఖ్య

కేవలము ఉన్నాను అను స్ఫురణ మాత్రముగా నున్న దానిని - "విజ్ఞాన మాత్రముగా" అని తెలుపుతున్నారు. నిర్మలత్వము లన్నింటికి ఆదియైన అతి నిర్మలుడు విశుద్ధుడను అని అనుచున్నారు. ముక్తుడు అనగా విడిపడిన వాడని భావము. బాగా విడిపడిన వానిని విముక్తుడని వివరించుచున్నారు.

పైగా ఆ వస్తువు అతి సూక్ష్మముగా నుండుటచే, అంతటా నిండి, దేనినైనను పట్టుకొనుటకో దానినుండి విడుటకో వీలు కానిదిగా నున్నది. బంధ విముక్తులకు కారణముగ చెప్పబడు కారణ కార్యములచే తెలియబడు ఏ న్యాయము నేను కాదని, సకల బంధముల నుండి, కల్పనల నుండి పూర్తిగ విడపడినదేదో అదియే బ్రహ్మము. ఆ బ్రహ్మమే నేనని చెప్పబడుచున్నది.

## 54వ పద్య తాత్పర్యము

చూడబడు మానవ దేహము, తల నుండి పాదముల వరకు కొలతగలదై, అంతఃకరణాదిగా గలదై, బయట చర్మముతో కప్పబడి నదైన జడ దేహమునకు అన్యమైన చిత్స్వరూపముగా, అంతట నిండిన పూర్ణముగను అమృతముగను, స్థిరముగ ప్రకాశించు ఆత్మ స్వరూపమే నేనని తెలిసికొనుము.

### వ్యాఖ్య

జడ శరీర రూపము యొక్క ఎత్తు, దాని లోపల బయట గల కొలతల నిచ్చి, యింతే దీని నిర్దిష్ట ప్రమాణమని వేలెత్తి చూపబడుచున్నది. దీనిని నేనని అభిమానించు జీవుడు శిరస్సు కంటే పైన ఏదైనా వున్న యెడల దానిని నా తలకు మించి యున్నదని చెప్పును. తలకి పైన గొడుగు వున్నది మరొకటి యున్నదని చెప్పి, తన పరిమాణమును కొంచెమైననూ మారకుండ కాపాడుకొనును. ఆ విధముగనే పాదముల క్రింద వున్నవి పాదరక్షలని చెప్పి, ఏ విధముగైననూ సరే జీవుడు ఈ దేహ ప్రమాణమును మాత్రము మించుట లేదు.

శరీరమును తప్ప మిగత యే వస్తువులను జీవుడు, నేనని చెప్పుట లేదు. అయితే నాది అని ఏకభోగహక్కును చాటించుటలో అతనికి అతనే సాటి. నాది యని తీర్మానించుటకు చాల తెలివి తేటలు గలవాడు.

దీనికి మారుగ సమస్త తత్త్వములలో అభిన్నముగా గోచరించు పూర్ణ చిత్ అనునది, దేహము నేను అనుటకు మాత్రము అన్యముగా యున్నది. దీనినే "దేహమునకు అన్యమైన చిత్స్వ రూపముగా" యని ఇందు చెప్పబడి యున్నది. ఈ జడమునకు అన్యముగా నున్న చిత్స్వరూపమే నేనని తెలిసికొనుమని, దీనినే "ఆత్మస్వరూపమే నేనని" పైన వచనములో చెప్పియున్నారు.

### 55వ పద్య తాత్పర్యము

చూచే చరాచరము లన్నిటికిని దైవము నేనే, యివన్నియు పుట్టుటకు తల్లి తండ్రిగనూ, తండ్రికి తండ్రిగనూ వున్నది నేనే.

ముక్తి నొంద గోరు ముముక్షువులు, ఆ మహోన్నత తురీయ పదమైన నన్నే, హృదయమున చింతన చేయుచు తీవ్రముగా ధ్యానించ వలయును.

**వ్యాఖ్య**

కారణమైన చిత్స్వరూపమే, కార్యరూపమైన ప్రపంచముగాను, అందు స్థావరజంగమ వస్తువులగనూ గోచరించుటచే, వీటన్నిటికినీ దైవము "నేనే" యని చెప్పబడినది. ఇవి పుట్టుటకు ప్రకృతి పురుషుడు అనబడు తల్లి తండ్రిగా నుండటంతో బాటు, ఆ రెండూ గోచరించుటకు ఆధార స్వరూపమైన తండ్రిగనూ వున్నానని అనుచున్నారు. అనగా అన్నిటికీ కారణమైనదీ ఆధారమైనదగు పరతత్త్వముగా నున్నది నేనే అని భావము.

సకల నామ రూపాదులతో ప్రపంచమును సృష్టించి, దానిని ఉన్నట్లు గోచరింపజేయు, ఆత్మస్వరూపము తనకంటూ ఒక నామమో రూపమో లేనిది. అట్లు నామ రూపములు లేని ఆత్మను ముముక్షువు తన హృదయములో చింతన చేసి దానినే ధ్యానింప వలయును. ఇతని చింతనలో ఉన్నచో వాసనలన్నియూ నశించును. పైగా ఎన్నడూ ఉన్నది అదియే కాబట్టి, ఆ స్థితియే స్థిరమై నిలచును. ముక్తిగోరు తీవ్ర సాధకులు దీనికై ప్రయత్నించి చేయగలరు యని చెప్పుచున్నారు.

**56వ పద్య తాత్పర్యము**

పూజింపదగు వారిలో నేను అర్హుడను, సాటిలేని మేటిని, సృష్టికర్తయగు బ్రహ్మ మొదలగు సకల దేవతలూ, భోగ

వస్తువులుగా (విలాస వస్తువులుగా) వాంఛించబడు (రంభ, ఊర్వశి మొదలగు) దేవకన్యలూ, భూలోకమునను‌న్న మానవులూ, యక్షులూ, గంధర్వులూ, నాగలోక వాసులూ, ఈ విధమైన ఇంకనూ ఎన్నో సమూహములుగా నున్న అందరి చేతనూ, పలు రకములైన యజ్ఞ యాగాదుల చేతనూ నేనే ఆరాధింపబడువాడనని తెలిసికొనుము.

**వ్యాఖ్య**

పదునెనిమిది గణములకు చెందిన యక్షులకు అధిపతియగు కుబేరుడు మొదలగువారు యక్షులనబడుదురు. గానములో శ్రేష్ఠమైనది గంధర్వగానము. ఆ సంగీతమునకు నేర్పరులగు గంధర్వులు కూడా పదునెనిమిది గణములకు చెందిన వారే. తక్షకుడు, వాసుకి (సర్పరాజు) కర్కోటకుడు మొదలగువారు నాగలోక వాసులు. వేదములలో చెప్పబడిన అతి పవిత్రమైన యజ్ఞయాగాదుల వలననూ ఆరాధింపబడువాడను నేనే. వేదాధ్యయన శీలురైన శ్రోత్రియులచే చేయబడు, సోమయాగము, వాజపేయము మొదలగు యజ్ఞములచేతనూ, అఖండ భూమండలాధిపతులగు చక్రవర్తులచే చేయబడు అశ్వమేధము, రాజసూయము వంటి యాగముల చేతనూ ఆరాధింపబడువాడను నేనే యని చాటిచెప్పుచున్నారు. సాధకుని మనసు పరిపరి విధాల పోక, ఒకే మార్గములో నుండుటకును, తేట తెల్లము చేసి మనస్సును ఈశ్వరచింతనలో నుండునట్లు చేయుటకు ఈ ఉపదేశము సహాయపడుచున్నది.

## 57వ పద్య తాత్పర్యము

ప్రశంసించతగ్గ శ్రేష్ఠమైన తపస్సుల చేతనూ, గొప్ప దానముల చేతనూ, అనేక విధముల సద్ధర్మముల చేతనూ, అందరూ నన్నే అర్చించి స్తుతించి పూజించుచున్నారు. విశాలమైన సృష్టియునూ, ఆ సృష్టికి చెందిన అన్ని వస్తువులూ ఒకడైన నేనేయని గ్రహింపుము.

## వ్యాఖ్య

సృష్టికర్తగనూ, సృష్టింపబడ్డ లోకమూ, సృష్టిలో గల వస్తువులూ ఒకడైన నేనే అని చెబుతున్నారు. పరవస్తువగు ఈశ్వరుని గూర్చి చేయబడు తపమే శ్రేష్ఠమైన తపస్సు. ప్రశంసింపబడు తపస్సును కూడా. ఇతర తపస్సులన్నీ కామ్యములతో గూడినవి. దైవమును చేరవలెననెడు దృష్టితో, లక్ష్యముతో చేయు దానమే శ్రేష్ఠమైనదని చెప్పబడుచున్నది.

ఇది కాకుండ, దేవాలయములు కట్టుట, చెఱువులు త్రవ్వుట, అన్న సత్రములు నెలకొల్పుట, గోశాలలు నిర్మించుట, పాఠశాలలను ప్రారంభించుట వంటి ధర్మములు కూడ, దేవుని పూజించుటయే. వీరందరు ఇన్ని రకములుగా నన్నే పూజించు చున్నారు.

ఈ ప్రపంచములో సంచరించునవి, సంచారము లేక స్థిరముగా నున్న (అచరములు) వన్నియూ, అనగా స్థావర జంగమములనబడు అన్ని వస్తువులూ నేనే. నన్ను తప్పించి వేరు ఉనికి లేదు. ఏక స్వరూపుడనగు నేనే అఖిలముగా నున్నాను. దీనిని తెలిసికొనుము.

తన దృష్టిని జ్ఞానమయముగ మార్చుకొని, పూర్ణ వస్తువును జ్ఞానచక్షువులచే చూచినవాడైనచో, పంచ భూతాత్మముగ అఖిలము జ్ఞాన స్వరూపమైన ఆత్మవస్తువుగా ప్రకాశించును. "ఏకస్వరూపుడనగు అగు నేనే" అనుటలోని భావమిదియే. ఇదే భావమును శ్రీ భగవాన్ ఉపదేశసారము" లోని 5వ శ్లోకములో ఈ విధముగా తెలిపియున్నారు.

అష్టమూర్తులు సర్వ
మా యీశ్వరుం డను
దృష్టితో కృతసేవ
దేవతా పూజ

**58వ పద్య తాత్పర్యము**

చర్మ చక్షువునకు కనబడు స్థూల దేహాభిమానియూ, సూక్ష్మకారణ దేహాభిమానులూ నేను గాను. అయితే ప్రపంచ సృష్టిలో గల అన్ని వస్తువులకు బంధువుగా, ఆధారమైనవాడను నేనే. జ్ఞానమే స్వరూపముగా గలవాడను. మరియు సర్వవ్యాపకుడుగనూ, ప్రాణుల దైవమగు ఈశ్వరుడూ, దోషరహితుడూ, జాగృదాది అవస్థలు లేనివాడనగుదును. నేను ప్రపంచ రహితుడను.

**వ్యాఖ్య**

తన రూపమే జ్ఞానమయముగ నుండుటచే, అంతట నిండిన విభుడుగనూ (సర్వవ్యాపకుడు), అన్నిటికి నాయకుడగుటచే ఈశ్వరుడనియూ, ఏ అవస్థలు లేని వాడని చెప్పి, చివరగా ప్రపంచ రహితుడుగా నున్నాడని వివరించుచున్నారు.

యధార్థముగా నిజస్వరూపమైన ప్రపంచమంటూ లేదు. నామ రూపములతో భేదముగా కనబడు ఈ ప్రపంచము, నామరూప కల్పనలను తీసివేసినచో ఉన్నది సర్వవేళలా వుండు జ్ఞాన పూర్ణమే. ఆత్మానుభవ ప్రజ్ఞలో ప్రపంచ దృశ్యము ఆకాశములో కనిపించు ముదురు నీల వర్ణము వలె ఉండును.

పలురకములైన నామ రూపములుగా వ్యాపించి మోహమునకు కారణమైన లోకము, లోకావతరణమునకు ముందున్న ఏకస్వరూప సుఖాకృతిగనే వుండినది. ఇది ఎట్లనగా: అనేక రంగులతో కూడిన నెమలి పింఛము (నెమలిపురి) చూచునపుడు అతిశయము గల్గించును. అయితే నెమలి గ్రుడ్డులో పిండాకృతిగ నున్నప్పుడు రకరకములైన రంగులు లేక ఒకే విధముగ నుండును. అటులనే ప్రపంచ సత్యమును తెలిసికొనవలెననిన ఆత్మస్వరూప స్థితి యందుండి తెలిసికొన వచ్చునని శ్రీ భగవానుని ఉపదేశము.

''నేను ఇది యది'' యని తోచు త్రిపుటితో గూడిన, కల్మషమైన, వాసనలు నిండిన, దేహములేకము ఎప్పుడూ లేదు. నేను ప్రపంచము లేనివాడినని గ్రహింపుము అని ఉపదేశించు చున్నారు.

## 59వ పద్య తాత్పర్యము

పై పద్యములో చెప్పిన ఆ నేనను నిజవస్తువు అనాది యైనది. జ్ఞానమే ఆకృతిగా పుట్టుక లేక అన్నిటికి ముందటిదైన అతి ప్రాచీనమైనది. అటువంటి ఆ పరవస్తువు తన స్వస్థలమైన హృదయ

గుహలో ఎప్పుడునూ వుంటూ, రూపమో, లోకమో, కళంకమో, పోలికలో, బంధములో యివన్నియూ లేకనే, మనస్సుతో ఆలోచించుటకో, కంటితో చూచుటకో, గ్రహించుటకో వీలు లేనిది.

**వ్యాఖ్య**

కాలమునకు కట్టుబడని కాలాతీతమైన సద్వస్తువగుటచే అది అనాది యని చెప్పబడినది. తెలిసికొనబడు అన్ని జ్ఞానములకునూ జ్ఞానమునిచ్చి గ్రహించునట్లు చేసి, తనను ఆ జ్ఞానముతో తెలిసి కోలేనట్టి ఆవల నుండుటచే ''జ్ఞానమే ఆకృతిగా'' యని చెప్పబడినది. ఆద్యంతములు లేకపోవుట వలన పుట్టుక లేనిదైనది.

ఒక కాలములో పుట్టినదని ఎవ్వరూ చెప్పలేనిది. అంత ప్రాచీనమైనది. అతి సూక్ష్మమగుటచే రూపమే లేనిది. రూపము లేకపోవుట వల్ల ఉత్పత్తియు లేదు వినాశము లేదు.

అవిద్య లేనిదగుటచే కళంకము లేదు. తాను తప్ప అన్యము లేని దగుటచే దేనితో పోల్చుటకూ ఉదహరించుటకూ వీలు లేనిది. అన్నిటికి తాను ఆలంబనముగా నుండునే తప్ప తనకు మాత్రము ఎటువంటి ఆధారము లేనిది. కనబడు రూపముల కెల్ల కారణమైన ఆ వస్తువు తనకు ఒక రూపము లేనిదైయున్నది.

ఈ పద్యములో ఆత్మ వస్తువు యొక్క లక్షణము ఉనికియు వివరింపబడినది.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

**(గత సంచిక తరువాయి)** **అనువాదం: జి. శ్రీహరిరావు**

శ్రీ భగవాన్ తమ కరుణను యిలా ప్రసరించేవారు. దృష్టితో కూడా శ్రీ భగవాన్ దీక్ష ప్రసాదించడం మేము గమనించాం కానీ, ఆ దీక్ష కూడా సంకల్పంతో కూడినదని మా నమ్మకం. ఆ సందర్భాలలో వారి దృష్టి యొక్క ప్రత్యేకత స్పష్టముగా కనిపించెడిది. భక్తుని పట్ల వారి నిశిత దృష్టీ, వారి కళ్ళల్లో కాంతీ వర్ణనాతీతము.

దీక్ష ప్రసాదించటము కొరకే కాక, శ్రీ భగవాన్ వారి నయనాలను పలురకములుగా ఉపయోగించేడివారు. వివిధ సందర్భాలలో, వివిధ వ్యక్తులను వారు చూసే పద్ధతిని వర్ణించుట కష్టము. ఒక్కొక్క చూపుకు ఒక్కొక్క అర్థముండెడిది. ఒకసారి, శ్రీ భగవాన్ సన్నిధిలోనే నేను శ్రీ మురుగనార్‌ను విమర్శించాను: ''మీ కవులు మీ రచనా స్వాతంత్ర్యముతో ఇష్టమొచ్చినట్లుగా రాస్తారు. 'రమణ సన్నిధి మురై'లో మీరు రాసినట్లు 'నిర్భయంగా వుండు' అని శ్రీ భగవాన్ మీతో ఎప్పుడైనా చెప్పారా?'' ఆ పుస్తకంలోనే మరో చోట, 'భయపడకు', 'భయపడకు' అని అభయమిస్తూ మన ఆదుర్దాలను నిర్మూలిస్తారు అని రాశారు. ''నిజం చెప్పండి. భగవాన్ మీతో ఎప్పుడైనా 'అభయమిస్తున్నాను' అని చెప్పారా?'' అని ప్రశ్నించాను.

శ్రీ మురుగునార్ కొంచెం ఆవేశంగా, ''వారి దృష్టి నాకలా కనిపిస్తుంది. 'ఏమీ భయం లేదు' అని చెప్పినట్లుగా నాకు తోస్తుంది'' అన్నారు.

‘‘మీ వివరణను నేను స్వీకరిస్తున్నాను. ఇక నేను ఏ విమర్శ చేయను’’ అని ఒప్పుకున్నాను.

ఈ మాట నేను శ్రీ మురుగనార్‌ని కానీ, శ్రీ భగవాన్‌ను కానీ మెప్పించడానికి అనలేదు. అది సత్యం కనుక అలా అన్నాను. శ్రీ భగవాన్ దృష్టి అనేకసార్లు ప్రస్ఫుటంగా, ‘‘నీకు శరణు యిచ్చాను. ఇక నీకేం భయం లేదు’’ అన్నట్లుంటుంది.

సామాన్యమైన విషయాలలో కూడా శ్రీ భగవాన్ దృక్కులు నమ్మశక్యం కానంత ప్రకాశవంతంగానూ, ప్రగాఢంగానూ వుండేవి.

ఒక సందర్భంలో ఒక భక్తురాలు సమర్పించిన ఒక తివాచీని శ్రీ భగవాన్ సున్నితంగా ఐనా దృఢంగా తిరస్కరించారు. ఆమె మనస్సు కష్టపెట్టుకొని, కోపంతో హాలు నుండి లేచి వెళ్ళిపోయారు. శ్రీ భగవాన్ నావైపు చూశారు. ఆ చూపు నాకు అర్థమైంది, ‘‘మీరు ఆమెకు మంచి స్నేహితులు. ఆమెకు ఎలాగో నచ్చ చెప్పి తిరిగి తీసుకురండి’’ అన్నట్లున్నది వారి చూపు. నేను బయటకు వెళ్ళే సరికి ఆమె రోడ్డు దగ్గరకు వెళ్ళి పోయి, ఇంటిదారి పట్టినప్పటికీ వారి ఆదేశం ప్రకారం నేను వెళ్ళి ఆ భక్తురాలిని వెనక్కు తీసుకు వచ్చాను.

‘‘మనస్సును నిగ్రహించడానికి సులభమైన మార్గమేది?’’ అని తరచుగా భక్తులు శ్రీ భగవాన్‌ను ప్రశ్నించేవారు. ఈ ప్రశ్నను శ్రీ భగవాన్ సాహిత్యముతో పరిచయమున్న వాళ్ళు, శ్రీ భగవాన్ గురించి ఎక్కువ తెలియనివాళ్ళు - కూడా అడిగేవారు. వారు బోధించిన ఆత్మ విచారణ మార్గముననుసరించి శ్రీ భగవాన్ సమాధానము మామూలుగా ఇలా వుండేది. ‘‘మనస్సును నిగ్రహించాలని ఎవరనుకుంటున్నారు? నిగ్రహించాలని అనుకునే

'నే' నెవరు? ఈ ప్రశ్న ఎవరికి ఉదయిస్తోంది? ఇవి తెలుసుకుంటే, అన్ని సమస్యలు పరిష్కారమౌతాయి. శ్రీ భగవాన్ మార్గమును అనుసరించినా, వేరు మార్గాలు అనుసరించినా, శ్రీ భగవాన్ ఒక్కటే అనే వారు: "దగ్గిర దారి ఏమీ లేదు. చేయవలసినది ఒక్కటే! మనస్సు బయటికి పోయినప్పుడుల్లా, దానిని వెనుకకు లాగి, అంతర్ముఖము చేసి, ఆత్మావశిష్టులు కావలెను. అది సులభము కాదు. కానీ నిరంతరం అభ్యాసము వలన మనస్సును నిగ్రహించ గల శక్తి చేకూరి, దానిపై పూర్తి అధికారము సంపాదించగలరు".

శ్రీ భగవాన్‌ను సందర్శకులు, తరచుగా ఇంకొక ప్రశ్న వేసేవారు: ఆధ్యాత్మిక సాధన చేసుకొనదలుచువారు సంసారమును పరిత్యజించి, వ్యాపారాదులను మానుకొని, ఏకాంత వాసముండి సన్యసించవలెనా అని అడిగెడి వారు. పరిత్యాగము మనస్సుకు సంబంధించినది. అది బాహ్య వస్తువులపై కానీ, మన పరిసరాలపై కానీ, ఆధారపడి వుండదు. ఒక వ్యక్తి తన గ్రామములో కుటుంబ జీవనము గడుపుతూ కూడా విరాగిగా జీవనం సాగించవచ్చు. వేరొక వ్యక్తి, తన సర్వస్వమునూ త్యజించి, అరణ్యములో జీవిస్తూ వుండిననూ, అతని మనస్సు తాను వదులు కొన్న వస్తువులపైనే లగ్నమై వుండవచ్చును. అలాంటప్పుడు అరణ్యమునకు పోయి జీవించుట వల్ల ప్రయోజనమేముండును? సంసారాన్నీ, వ్యాపారాన్నీ వదిలి వేయవచ్చును కానీ, మనస్సు నీతోనే వున్నది కదా! 'నేను గృహస్థుడను' అనే భావన వదిలి 'నేను సన్యాసిని' అనే భావన కల్పించుకుంటారు. అంతే! పాత సంబంధాలు పోయి కొత్త సంబంధాలు అతుక్కుంటాయి. కావలసినది మానసిక పరిత్యాగము. 'నేను గృహస్థుడను', 'నేను సన్యాసిని' అన్న భావనలు

కాక 'నేను ఆత్మను', అన్న భావన నిలుపుకోవలెను.

పని విషయంలో కూడా అంతే! ఏ పని కూడా ఆధ్యాత్మిక జీవనానికి అడ్డంకి కాదు, 'నేను చేస్తున్నాను', అన్న భావనే అడ్డంకి. ఈ 'నేను ఎవరు?' అని విచారించుకొని, తెలుసుకొన్న యెడల అడ్డంకులు తొలగిపోయి, కర్తృత్వము నశించి, కర్మ ఫలత్యాగము సాధించగలరు. పని కూడా, ఇంతకు ముందు కంటే ఎక్కువ కౌశలంతో చేయగలుగుతారు. నిరంతరమూ ఆత్మావశిష్ఠులై వుండి శాశ్వతానందమూ, శాంతి అనుభవించగలరు. పని చేయాలా, అక్కర లేదా అని ఆలోచించుట అనవసరము. పనిచేయుట మన ప్రారబ్ధమైన ఎంతవద్దనుకున్ననూ పని చేయుట తప్పదు. అటుల కాక, మన ప్రారబ్ధము వలన పని చేయు అవసరము లేకపోయిన, ఎంత ప్రయత్నించిననూ చేయుటకు పని వుండదు.

కొంతమంది భక్తులు, కర్మ పరిత్యాగము వంటి విషయముల గురించిన ప్రశ్నలు వేసిన తరువాత, "భగవాన్ యింటినీ, కుటుంబ జీవనమునూ త్యజించి సన్యాస జీవితమును ఎందువలన యెన్ను కున్నారు?" అని ప్రశ్నించెడివారు.

ఈ ప్రశ్నకు కూడా శ్రీ భగవాన్ సమాధానము ఒక్కటే! "ఎవరి ప్రారబ్ధము ఎటులున్న అటులనే జరుగును. ఇల్లూ, వాకిలీ వదల వలెనా, లేదా అన్న ప్రశ్న అనవసరము. అది మీ చేతుల్లో వుండదు".

ఒకసారి నేను శ్రీ భగవాన్‌ను యిలా ప్రశ్నించాను: "మోక్ష సాధన మానవులకే సాధ్యము కానీ పశు పక్ష్యాదులకు కాదు అది నమ్ముతారు. మోక్షము కావలెనన్న ముందు మానవ జన్మ ఎత్తాలన్న నమ్మిక నిజమేనా భగవాన్?"

శ్రీ భగవాన్ సమాధానమిలా యిచ్చారు: "అవసరము లేదు,

మీరు గజేంద్ర మోక్షము చదవలేదా?" (మన పురాణాలలో మొసలి నోట చిక్కుకున్న గజేంద్రము భగవంతుని ఎలుగెత్తి ప్రార్థించి, కాపాడబడుటయే కాక మోక్షము సాధించినదని చెప్పబడినది).

ఈ సంభాషణ గోవు లక్ష్మి నిర్వాణమునకు చాలా ముందు జరిగినది. లక్ష్మి నిర్వాణ సమయమప్పుడు నేను ఆశ్రమంలో లేను. ఒక నెల రోజుల తరువాత, నేను ఆశ్రమానికి వెళ్ళినప్పుడు లక్ష్మి సమాధి మీద చెక్కడానికి తాము వ్రాసిన చరమ లిఖితమును శ్రీ భగవాన్ నాకు చూపించారు. అందులో ఒక పదము గురించి నాకు కలిగిన సందేహాన్ని శ్రీ భగవాన్ ముందుంచాను. 'విముక్తి' అనే పదము నిజముగా మోక్షాన్నే సూచిస్తుందా లేక, మనము మరణానికి మామూలుగా గౌరవ వాచకము వాడినట్లా అని అడగబోయాను. నా భావమును తెలుసుకొన్న శ్రీ భగవాన్ 'ఔను! మోక్షమనే అర్థమిస్తుంది' అని సెలవిచ్చారు. ఆ విధంగా, శ్రీ భగవాన్ కృత చరమ లిఖితము ప్రకారము 1948 జూన్ 18వ తారీఖున గోవులక్ష్మి శివసాయుజ్యము చెందినదని అర్థము చేసుకోవలెను.

వివిధ భాషలలో భక్తులు లక్ష్మిని గురించి వ్రాసిన పాటలను చదవమని శ్రీ భగవాన్ నాకిచ్చారు. వాటినన్నిటినీ చదవడమే కాక, లక్ష్మి వృత్తాంతాన్ని మొత్తం - ఆమె ఆశ్రమంలో 'అడుగు పెట్టినప్పటి నుండీ ఆమె దేహ విముక్తి వరకూ-మళ్ళీ శ్రీ భగవాన్‌ను అడిగి తెలుసుకున్నాను. భక్తుల సౌలభ్యము కొరకు లక్ష్మి జీవిత కథను వ్రాసి శ్రీ భగవాన్‌తో సరిచేయించుకున్నాను. ఈ కథనే, శ్రీ రమణాశ్రమము వారు 'గోవు లక్ష్మి' అన్న పేరుతో ప్రచురించారు.

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింప బడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీమతి సూరి నాగమ్మ గారు

యనమండ్ర సంధ్యాదేవి

(భగవాన్ రమణ మహర్షి భక్తగణంలో శ్రీమతి సూరినాగమ్మ గారు అగ్రగణ్యులు. మహర్షి జీవిత కాలంలో వారి ఆశ్రమంలో ఎన్నో సంవత్సరాలు వారి సేవ చేశారు. అన్నిటికంటే చెప్పుకో దగినది ఆవిడ రచించిన "రమణాశ్రమ లేఖలు" అన్న గ్రంథం. ఆశ్రమంలో రమణుల సన్నిధిలో జరిగిన విషయాలు అన్నింటిని భావితరాలకు ఎంతో వివరంగా వర్ణించిన ఈ రచన రమణ భక్తులకు ఎప్పటికీ పఠనీయమే.

శ్రీ రమణ జ్యోతిలో ఇప్పటికి రెండుసార్లు ఈ భక్తురాలిని గురించిన వ్యాసం ప్రచురితమైంది. శ్రీమతి సూరినాగమ్మ గారు 1980 మార్చి చివరన అరుణాచలంలో ఐక్యం చెందారు. ఈ సందర్భంగా ఆమె గురించిన ఈ వ్యాసం ప్రచురించబడుతోంది)

- సంపాదకులు

భగవాన్ శ్రీరమణ మహర్షి మహాభక్తాగ్రగణ్యులలో శ్రీమతి సూరినాగమ్మ గారు ఒకరు. సూరినాగమ్మగారి పేరు చెప్పగానే శ్రీరమణ భక్తులకు ముందుగా స్ఫురించేది శ్రీరమణాశ్రమ లేఖలు. అంతటి వైభవోపేతురాల లేఖలు ఎంతో ఆదరణ పొందాయి. శ్రీరమణాశ్రమ లేఖలు చదువని రమణ భక్తులు ఉండరు అనుటలో అతిశయోక్తి లేదు.

సూరినాగమ్మ గారు మంగళగిరి దగ్గర ఉన్న కొలనుకొండ అగ్రహారంలో భాద్రపద మాసంలో జన్మించారు. కొలనుకొండ భోగేశ్వర క్షేత్రం, తండ్రి చిన వెంకట శాస్త్రి గారు, తల్లి సోమిదేవమ్మ. నాగమ్మగారికి ముగ్గురు సోదరులు. ఒక సోదరి ఉన్నారు. తల్లి తండ్రులకు నాగమ్మగారు ఆఖరి సంతానముగా జన్మించారు.

ఆవిడ బాల్యం అంతా చాలా కష్టాలతోనే గడిచింది. ఆవిడకు నాలుగు సంవత్సరముల వయస్సులోనే తండ్రి, పది సంవత్సరముల వయస్సులో తల్లిగారు గతించారు. నాగమ్మ గారికి ఊహ తెలియని వయసులోనే వివాహమయి ఒక సంవత్సరానికే భర్త కూడా గతించారు. వరుసగా ఇన్ని కష్టాలున్న ఆవిడ మానసికంగా బాగా దెబ్బతిన్నారు. తండ్రిగారి భవంతిలో వంటరిగా ఎటువంటి సౌకర్యము ఆశించకుండా, గాలి వెలుతురు సోకని చీకటి గదిలో దుఃఖిస్తూ గడుపుతూ ఉండేవారు. రుచి ఎరుగని సాత్విక ఆహారాన్ని మాత్రమే స్వీకరించేవారు. ఆవిడకు తోడుగా అన్నట్లు సర్పములు కూడా ఆ భవంతిలో తిరుగుతూ ఉండేవి. నాగమ్మ గారు భక్తి గీతాలను, భాగవతంలోని పద్యాలను రాత్రి పగలు అని లేకుండ పారాయణ చేసుకొంటూ ఉండే వారు. ఇది ఒక రకంగా ఆవిడకు ఈశ్వరానుగ్రహం అనీ చెప్పాలి. నాగమ్మ గారు పెద్దగా ఏమీ చదువు కోలేదు. అక్షర జ్ఞానం కూడా అంతంత మాత్రమే అయినా భాగవతం, రామాయణంలాంటి ఆధ్యాత్మిక పుస్తకాలను, గ్రంథాలను నెమ్మదిగా గుణించుకొంటు చదువుకొనేవారు.

ఆవిడ అన్ని బంధాల నుండి చిన్నవయసులోనే విముక్తు రాలయింది. భగవత్ చరణాలను పట్టుకొని అదే ధ్యానంలో కాలాన్ని గడుపుతూ ఉండే వారు. నాగమ్మగారికి బాగా ఇష్టమయిన గ్రంథం, పోతనగారి భాగవతం. అందులో కపిల మహాముని తన తల్లి అయిన దేవహూతికి చేసిన తత్వబోధ ఆవిడ మనోఫలకంపై బాగా ముద్ర వేసింది. నాకు కూడా అటువంటి సిద్ధపురుషులెవరయినా గురువుగా లభిస్తే బాగుండును అని ఆర్తితో తలచుకొంటూ ఎంతో, విపరీతంగా ఏడుస్తూ ఎప్పటికో నిద్రలోనికి జారుకునేవారు. ఆ విధంగా ఆవిడకు ఒకసారి స్వప్నంలో ఒక సిద్ధపురుషుడు తేజోమయంగా దర్శనమిచ్చి అదృశ్యమయినారు. ఆవిడ తమ హృదయఫలకంపై ఆ దివ్య తేజోమూర్తిని నిలిపి, గురుసేవకై పరితపించి పోతూండేవారు. భౌతికంగా సంసారంలో ఉన్నా, అంటే వారి అన్నగార్ల మధ్యలో ఉన్నా మానసికంగా మాత్రం ఆధ్యాత్మిక చింతనలోనే గడిపేవారు. ఆవిడ అన్నగార్లు, వదినగార్లు, చాలా సహకారంగానే ఉండేవారు. వారితో నాగమ్మగారు చాలా పుణ్యక్షేత్రాలు దర్శించారు. ఎన్నో వేదాంత గ్రంథాలు చదివే వారు. అయినా ఆవిడ మనస్సుకి ఎంత మాత్రము శాంతి లభించేది కాదు. బంధువుల మధ్యలో, సంసార బంధలలో గడపడము ఆవిడకు చాలా దుర్భరంగా ఉండేది. ఎల్లవేళలా ఒంటరిగా, ప్రశాంతముగా జీవించాలని ఆశించేవారు. 1941వ సంవత్సరములో అన్నగారి అనుమతితో శ్రీరమణాశ్రమానికి ఒంటరిగా చేరుకొన్నారు.

శ్రీరమణుల ప్రథమ సందర్శనంలో నాగమ్మ గారు ఇలా అనుకొన్నారు. నాకు స్వప్నంలో కనిపించిన సిద్ధపురుషులు ఈయనే.

నన్ను కడతేర్చి దారి చూపే సద్గురువు ఈయనే అని తలచి, అనన్య శరణాగతి చెందారు. నాగమ్మగారికి మనోవ్యథ అంతరించి మనస్సు పరమశాంతితో నిండిపోయింది. అప్పటికప్పుడే 8 శరణాగతి పద్యాలు వ్రాసి భగవాన్‌కి సమర్పించారు. భగవాన్ సంపూర్ణ అనుగ్రహాన్ని పొందిన ధన్యురాలు నాగమ్మగారు. భగవాన్ రమణుల నుండి వెలువడిన అమృత వాక్కులు, ఉపదేశాలు వంటివి వెంట వెంటనే ఆవిడ వ్రాసుకొంటూ ఉండేవారు. అన్నగారి ప్రోద్బలంతో ప్రతిరోజూ భగవాన్ సన్నిధిలో జరిగే ప్రతీ సంఘటనను చక్కని శైలిలో లేఖలుగా వ్రాసి పంపుతూండేవారు. అవే శ్రీరమణాశ్రమ లేఖలుగా గ్రంథాలుగా ఆవిష్కరింపబడ్డాయి. నాగమ్మ గారు వ్రాయబట్టే రమణ భగవాన్ అమృత వాక్కులు, ఉపదేశ వాక్యాలు ఈ రోజు మన అందరికీ తెలిసే భాగ్యం కలిగింది.

తనదైన శైలిలో, ఎంతో అద్భుతంగా అందరికీ అర్థమయ్యే రీతిలో, మనమే స్వయంగా భగవాన్ సన్నిధిలో ఉండి వింటున్నట్లు అనుభూతి కలిగించేలా నాగమ్మ గారు ఆ లేఖలను వ్రాశారు. ఇదంతా ఆవిడకు శ్రీరమణానుగ్రహమే అని అనుకోవాలి. నాగమ్మ గారు ఇతర భక్తుల ప్రోద్బలంతో ఇంకా చాలా రచనలు చేశారు. అందులో ముఖ్యమయిన గ్రంథము 'నా రమణాశ్రమ జీవితము' ఒకటి. భగవాన్ మీద ఎన్నో శ్లోకాలు, పద్యాలు వ్రాసేవారు. వాటిని మనము చదువుతూంటే ఎంతో దివ్యమైన భక్తి కనిపిస్తుంది. నాగమ్మ గారు వ్రాసిన పద్యాలు, శ్లోకాలను భగవాన్ ఎంతో ఆదరణతో వాటిని భద్రంగా ఒక బైండ్ పుస్తకంలో పొందుపరిచేవారు. శ్రీ

రమణాశ్రమ లేఖలు రెండవ భాగము ప్రచురించే సమయంలో నాగమ్మ గారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. తరువాత కాలంలో అంటే 1964, 65 సం॥ మధ్యలో శ్రీరమణాశ్రమ లేఖలు 3,4,5 భాగములు ఆశ్రమము వారే అచ్చు వేయించారు. మహా పండితులు అయిన శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారు ఎంతో అబ్బుర పడి, నాగమ్మగారి లేఖలను ఎంతగానో ప్రశంసించారు. ఆ లేఖల అవతరణిక వారే వ్రాశారు. సద్గురువు చరణాలనే నమ్ముకొన్న నాగమ్మ గారికి అంతా రమణమయంగానే తోచేది. ఆశ్రమంలో ఉన్న గోలక్ష్మి అంటే ఆవిడకు చాలా అభిమానం ఉండేది. ఎన్నో సేవలు చేసేవారు. నాగమ్మగారు 10 సం॥లు రమణాశ్రమ వాసిగానే నిలిచి పోయారు. భగవాన్ నిర్వాణానంతరం ఎక్కడ ఉన్నా తనను శ్రీరమణాశ్రమ వాసిగానే తలచుకొంటూ ఉండేవారు. భగవాన్ చివరి సమయంలో దూరం నుండి నాగమ్మగారు "ప్రభూ" ఒక్కసారి నీ కృపావీక్షణము నా మీద ప్రసరింప చేయవా" అని మనస్సులో ప్రార్థించగానే, భగవాన్ అమితమయిన కరుణతో తమ చల్లని చూపు ప్రసరింప చేశారు. నాగమ్మగారి మనస్సు భక్తితో తన్మయమయింది. పూర్వజన్మ సుకృతం ఎంతో ఉండడము వలననే భగవాన్ అనుగ్రహ వీక్షణాన్ని పొందగలిగారు. నాగమ్మగారు అతినిరాడంబరమయిన జీవితాన్ని గడుపుతూ, సాత్వికమయిన ఆహారాన్ని మాత్రమే తీసుకొనేవారు.

1953వ సంవత్సరములో వారి చిన్న అన్నగారితో కాశీ యాత్ర చేశారు. కాశీలో విశ్వనాథుని దేవాలయ గర్భగుడిలో 1 గంట

సమయం విశ్వేశ్వరునికి కాపలాదారిగా ఉండవలసి వచ్చింది. అనుకోని ఆ మహాభాగ్యానికి నాగమ్మగారు ఎంతో మురిసి పోయారు. శ్రీరమణానుగ్రహం ఇంతకు ముందే వచ్చింది కదా! మరి నాగమ్మగారు రామేశ్వర యాత్ర కూడా చేశారు. ఎన్ని క్షేత్రాలు వారు తిరిగినా అంతటా శ్రీరమణులను మానసికంగా దర్శించు కొంటూ ఉండేవారు. తరువాత కాలంలో కొలనుకొండ చేరి అక్కడ భోగేశ్వర ఆలయంలో అభిషేకం చేయించాలని వచ్చిన నాగమ్మ గారు ఒక సర్పాన్ని చూడడము జరిగింది. మాటలతో ఆ సర్పాన్ని బయటకు వెళ్ళిపోయేలా ప్రార్థించగానే ఆ సర్పము నిష్క్రమించింది. ఏ మహా పురుషుడో ఆ రూపంలో వచ్చి ఉంటారని నాగమ్మగారి భావన.

ఆరోగ్యరీత్యా నాగమ్మగారి చివరి రోజులు విజయవాడలోనే గడిపారు. ఆ ఇంటినే శ్రీరమణాశ్రమముగా తీర్చిదిద్దుకున్నారు. అక్కడికి ఎంతో మంది భక్తులు చుట్టుప్రక్కల ఊళ్ళ నుండి వచ్చేవారు. అదే ఆంధ్ర రమణ క్షేత్రమయింది. ఆధ్యాత్మిక పథానికి, నాగమ్మగారు అందరికీ ఆదర్శనీయురాలయింది. ఆ ఇంట్లో రోజూ శ్రీరమణ పారాయణము జరుగుతూ ఉండేది. కార్తిక దీపోత్సవం లాంటివి ఎన్నో నాగమ్మ గారు జరుపుతూనే ఉండేవారు. నాగమ్మ గారు 1980వ సంవత్సరములో భౌతిక దేహము వీడి రమణైక్యము పొందారు. భగవాన్ శ్రీరమణులకు అనన్య శరణాగతి చెంది, స్వామి సంపూర్ణానుగ్రహము పొందిన శ్రీ సూరినాగమ్మ గారు ధన్యజీవి. వారికి మన అందరి శిరసా, మనసా నమస్కారములు.

# No Escaping Yama

Talk 86

Dr K Subrahmanian

Everyone is afraid of *mrithyu*, death; we think our happiness lies in being alive. We are ready to put up with anything in order to be alive. When someone suffers from a dreadful disease, other people think that he is suffering so much that it would be a relief for him if he dies - but the sufferer doesn't think so. He wants to live for some more years. Nobody wants to die. There are a few exceptions, as in the case of a suicide, where a person finds life so miserable that he puts an end to it. But, by and large, no one wants to die.

Day after day, we have breakfast, lunch, tea, and then dinner. We go to bed, get up, and then talk to people. We do this for years, with an occasional change in routine. In the course of this, we are happy, unhappy, and sometimes even depressed. When we don't have anything interesting to do, we say we are bored, but we never say we are tired of life. We would like to live as long as we possibly can, but we don't want to be called old. We want to remain young. This is human nature. When we take people around our village, and show them the ancient temple, we say with great pride that the temple is perhaps eight hundred years old. In such cases, the older it is, the prouder we are. However, when it comes to human beings, nobody likes to be told he is old; there are no antiques among human

beings. A very old object is greatly appreciated, but a very old person, on the other hand, rarely so. So Shankara says:

*ma kuru dhana jana yauvana garvam*
*harati nimesaatkaalah sarvam maayaa*
*mayamidamakhilam hitva*
*brahmapadam tvam pravisa viditva*

We are proud of our youth, and when we are young, we sometimes make fun of old people and their outdated ideas. We think that they are old-fashioned, and we say so many negative things about old age. This is because when we are young, we can never imagine that we too will become old, and die one day. It is difficult for us to think of death because we feel it is very far away. On the other hand, it is equally very difficult for the old not to think of death. When we hear that someone we knew has passed away, we are shocked - that is human nature.

*dhana jana yauvana garvam*- just because we have a lot of money, we think we can buy people and happiness. Hence, we are proud of our money power, our youth, and of our friends and relatives. We believe that in an emergency, they will come to help us. But Shankara warns us not to be proud of these things.

*harati nimesaatkaalah sarvam*- just because we are young, have money (*dhana),* and have friends (*jana*), it doesn't mean that Yama will say that he will not touch us for a hundred years. When the time comes, all these possessions will be taken from us. When Yama arrives, we will have neither *dhana*, *jana* nor *yauvana* - all these will

